

ధర్నా చేస్తున్న హింద్‌మజ్దూర్ సభ జాతీయ కార్యదర్శి సుదర్శన్‌రావు, రెబ్బ రామారావు తదితరులు

## కార్మిక శాఖ కమిషనరేట్ ముందు హెచ్‌ఎంఎస్ పెద్దఎత్తున ధర్నా

### ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిందంటూ ఆరోపణలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మార్చి 10, ప్రభాతవార్త:** కార్మిక శాఖ రాష్ట్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిపోయిందని హింద్‌మజ్దూర్ సభ జాతీయ కార్యదర్శి సుదర్శన్‌రావు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రియాజ్ అహ్మద్, రెబ్బరామారావు ఆరోపించారు. కార్మిక చట్టాలను అమలు చేయకపోగా రాష్ట్రంలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. సమానపనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి పెద్దఎత్తున ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పిం చారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికచట్టాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, కనీస వేతనాల బోర్డు చేసిన సిఫార్సు లను రాష్ట్ర కార్మిక శాఖ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కనీస వేతనాలు ఇవ్వాలని, బోర్డు సిఫార్సు చేసి మూడేళ్ళు గడిచినా గెజిట్ జారీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక శాఖ అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తున్నారరని విమర్శించారు. కార్మిక చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేసేంతవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ నేతలు ఈశ్వర్ ప్రసాద్, నర్సి రెడ్డి, రాజులతోపాటు పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితకు మహిళా రిజర్వేషన్లు ఇప్పుడు గుర్తుకు వచ్చాయా?

### మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ కవితకు గత తొమ్మిది సంవత్సరాల తరువాత ఇప్పుడు మహిళా రిజర్వేషన్ 33శాతం గురించి ఆలోచన ఇప్పుడు వచ్చిందా అంటూ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతారావు ప్రశ్నించారు. శుక్రవారం ఈ మేరకు ఒకన ప్రకటన విడుదల చేశారు. ఇన్ని రోజులు నుంచి మీరు నిద్రపోతున్నారనా అన్నారు. ఎల్‌పిజి ధరల పెంపు, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలతో నిత్యావసర వస్తువుల ధరలపై మీ తండ్రి సిఎంగా ఉన్నారు. వీటిని తగ్గించే విషయంలో మీ తండ్రితో మాట్లాడలేరా అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత వరకు మీ పార్టీకి మహిళా అధ్యక్షురాలు లేరు. 33 రిజర్వేషన్ మీ పార్టీ ఇంప్లిమెంటేషన్ చేసి మాట్లాడితే బాగుంటుందన్నారు. మహిళలకు మీ మంత్రులు ఎంత వరకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ వారు మాత్రమే 33శాతం రిజర్వేషన్ గురించి,మహిళా బిల్లు గురించి మాట్లాడారన్నారు.

## విఓఎల సమస్యలను పరిష్కరించండి

### సిఎం కెసిఆర్‌కు ఎమ్మెల్యే జగ్గారెడ్డి లేఖ

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** ప్రభుత్వం వెంటనే విఓఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిఎం కెసిఆర్‌ను ఎమ్మెల్యే జగ్గారెడ్డి కోరారు. ఈమేరకు సిఎం కెసిఆర్‌కు బహిరంగ లేఖ రాసారు. సెర్ప్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్స్‌ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో విఓఏలు కూడా కీలక పాత్ర పోషించారన్నారు. విఓఏలు గ్రామస్థాయిల గత 20 సంవత్సరాలుగా డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా సామాజి కంగా ఎదుగడానికి పనిచేస్తున్నార న్నారు. మొత్తం రాష్ట్రంలో 20వేల వరకు విఓఏలు పనిచేస్తు న్నార న్నారు. ఎనిమిది సంవత్స రా లుగా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. రూ.15వేల జీతం, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తిం పు, రూ.10లక్షల భీమా, ఆరోగ్య భీమా కల్పించాలన్నారు. ఈ అం శాన్ని అసెంబ్లీలో ప్రస్తా వించి నట్లు, ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు.

## అగ్నివీరులకు బిఎస్‌ఎఫ్‌లోనూ 10 శాతం రిజర్వేషన్

### వయో పరిమితిలో సడలింపు : కేంద్ర హోంశాఖ

**న్యూఢిల్లీ, మార్చి 10:** అగ్నివీరులకు మరో అవకాశాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అగ్నివీరులుగా రిటైర్ అయినవారికి సరిహద్దు భద్రతాదళం(బిఎస్‌ఎఫ్)లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు ప్రకటించింది. కేంద్ర హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. బిఎస్‌ఎఫ్‌లోకి తీసుకోవడానికి అగ్నివీరులకు వయోపరిమితిలోనూ సడలింపు ఇస్తారు. అగ్నివీర్ మొదటి బ్యాచ్‌లో రిటైర్ అయినవారికి ఐదేళ్లు, ఆ తర్వాత



రిటైర్ అయినవారికి మూడేళ్లపాటు వయోపరిమితిలో సడలింపు కల్పిస్తారు. మాజీ అగ్నివీరులకు దేహదారుఢ్య పరీక్ష నుంచి కూడా మినహాయింపు ఇస్తారు. అందుకోసం బిఎస్‌ఎఫ్, జనరల్ డ్యూటీ కేడర్(నాన్ గెజిటెడ్) రిక్రూట్‌మెంట్ రూల్స్..2015కు సంబంధించిన నిబంధనలను కేంద్ర హోంశాఖ సవరించింది. మార్చి 9 నుంచి ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని పేర్కొంది. నాలుగేళ్లపాటు దేశ సైనికులుగా సేవలందించిన అగ్నివీరులకు సిఎపిఎఫ్, అసోం రైఫిల్స్‌లో 10 శాతం రిజర్వేషన్‌తోపాటు వయో పరిమితిలో సడలింపుల్ని కేంద్ర హోంశాఖ ఇప్పటికే ప్రకటించింది. తాజాగా బిఎస్‌ఎఫ్ నియామకాల్లోనూ 5,3 యేళ్ల సడలింపు ఇవ్వడం కొంత ఊరటనిస్తుందని భావిస్తున్నారు. తాజా ఉత్తర్వుల ప్రకారం తొలిబ్యాచ్‌లో అగ్నివీరులుగా సేవలందించినవారికి కేంద్ర భద్రతా దళాలతోపాటు అసోం రైఫిల్స్‌లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. కేంద్రం గతేడాది జూన్ 14న అగ్నిపథ్ స్కీంను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద పదిహేడున్నర యేళ్ల నుంచి 21 యేళ్లలోపు వారిని ఆర్మీ, నావీ, ఎయిర్‌ఫోర్స్‌లోకి నాలుగేళ్లపాటు ఒప్పంద ఉద్యోగులుగా తీసుకుంటారు. ఈ స్కీం కింద ఎంపికైనవారిని అగ్నివీరులుగా రక్షణశాఖ నామకరణం చేసింది. వారిలో 25 శాతంమందిని ప్రతిభ ఆధారంగా రెగ్యులర్ సర్వీస్‌లోకి తీసుకుంటారు. అయితే, మిగతావారి పరిస్థితి ఏమిటన్న విమర్శలొచ్చాయి. దాంతో, వారి కోసం కేంద్రం పలు అవకాశాల్ని కల్పిస్తోంది.

# జోరుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** ఈ నెల 13న జరగనున్న హైదరాబాద్-రంగారెడ్డి- మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన ప్రచారం జోరుగా సాగు తోంది. సాధారణ ఎన్నికల లాగా అభ్యర్థులు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. గత నెల 16 నుంచి 23 వరకు నామినేషన్లను దాఖలు చేసిన అనంతరం అభ్యర్థులు ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణనాటికి 21 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వారందరూ కూడా ప్రస్తుతం ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం బహిరంగంగా కనిపించకపోయినప్పటికీ ఉపాధ్యాయుల దగ్గరకు వెళుతూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. కొందరు అభ్యర్థులు అయితే ఉపాధ్యాయులు ఎక్కువగా ఉండే కాలనీలు, అపార్ట్‌మెంట్ల దగ్గరకు రాత్రి సమయంలో.. ఉదయం 8 గంటలలోపు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాస్త ఇప్పుడు నాలుగు జిల్లాలుగా విడిపోవడం.. పాత ఉమ్మడి జిల్లాలో పనిచేసే ఉపాధ్యాయుల్లో ఎక్కువమంది హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పాటుచేసుకొని వారి పాఠశాలలకు వెళ్లేవారు.. అలాంట వారికి ఇప్పుడు ఓటు హక్కు ఇక్కడే ఉంటుంది. దాంతోపాటు నివాసం హైదరాబాద్‌లో ఉంటూ ఇతర ఏ జిల్లాల్లో అయినా ఉపా ధ్యాయుడిగా కొనసాగుతున్న వారికి కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించిన నేప థ్యంలో హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లో పనిచేసేవారు.. హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నారు కాబట్టి వారికి కూడా ఎమ్మెల్సీ ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. అటువంటి వారిని కూడా పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థులు తమకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని అభ్యర్థిస్తూ వారి ఇళ్లకు సైతం వెళుతున్నారు. వీటితోపాటుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు అలాగే ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో కనీసం 20 మందికంటే ఎక్కువగా ఉన్న పాఠశాలలకు నేరుగా అభ్యర్థులు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు.

**పోటీలో 21 మంది అభ్యర్థులు**

ప్రస్తుతం ఈ నియోజకవర్గం నుంచి కాటేపల్లి జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. కాటేపల్లి రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. రెండుసార్లు కూడా ఆయన పీఆర్‌టీయూ టీఎస్ తరపున పోటీచేసి గెలుపొందారు. అయితే ఈసారి పీఆర్‌టీయూ టీఎస్ కాటేపల్లి మద్దతు

### పోటీలో 21 మంది అభ్యర్థులు
### టిఎస్ యుటిఎఫ్, పిఆర్‌టియు టిఎస్ మధ్యే పోటీకి అవకాశం

ఇవ్వలేదు అధికార బీఆర్‌ఎస్ కూడా తమ మద్దతు ప్రకటించలేదు. పీఆర్‌టీయూ టీఎస్ తమ అభ్యర్థిగా మాజీ రాష్ట్ర కార్యదర్శి జి చెన్నకేశవరెడ్డిని ప్రకటించింది. ఆయన ప్రచార బాధ్యతలను పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు తమ భుజాలపై వేసుకొని విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మరో ప్రధాన సంఘం టీఎస్ యూటీఎఫ్. ఈ సంఘం గత రెండు ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీలో పెట్టింది. ఈసారి కూడా సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన పి మాణిక్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. వీరు ప్రచారంలో ముందున్నారు. ఉపాధ్యాయ సంఘాల్లో మొదటగా ఏర్పడిన సంఘం ఎస్‌టీయూ టీఎస్ కూడా అమ అభ్యర్థిని ప్రకటిం చింది. ఎస్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన భుజంగరావు పోటీ చేస్తున్నారు. అయితే గత ఎన్నికల్లో ఎస్‌టీయూ టీఎస్ దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్ యజమాని ఏవీఎన్ రెడ్డికి మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ ఈసారి ఎన్నికల్లో తమ అభ్యర్థినే పోటీలో నిలబెట్టింది. భారతీయ జనతాపార్టీ తరపున దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్స్ అధినేత ఏవీఎన్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. ఏవీఎన్‌రెడ్డికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) తమ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఉపాధ్యాయ సంఘాల నుంచి కాకుండా తెలంగాణ స్కూల్ టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయిస్ అసోసియేషన్(టీఎస్‌టీసీఈఏ) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతున్న అయినేని సంతోష్‌కుమార్ కూడా ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు పనిచేసిన హర్షవర్ధన్‌రెడ్డి కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఆయనకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్(జీటీఏ) నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసం ప్రభాకర్ పోటీ చేస్తున్నారు. టీపీటీఎఫ్ అభ్యర్థిగా డాక్టర్ వినయ్‌బాబు పోటీలో ఉన్నారు. బహుజన క్లాస్ టీచర్స్ అసోసియే షన్(బీసీటీఏ) తరపున విజయ్‌కుమార్ పోటీ చేస్తున్నారు. లోకల్ క్యాడర్ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(ఎస్‌సీజీటీఏ) తరపున ఎస్ రవీందర్ పోటీలో ఉన్నారు.

**వీరి మధ్యనే పోటీ..**

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధానంగా పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్న కేశవరెడ్డి, టీస్ యూటీఎఫ్ అభ్యర్థి పి మాణిక్‌రెడ్డి మధ్యనే కొనసాగే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. గత ఎన్నికల్లో గెలిచిన కాటేపల్లికి పీఆర్‌టీయూ టీఎస్ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో వారు పోటీలో ఉంటూ.. గతంలో రెండో స్థానంలో ఉన్న మాణిక్ రెడ్డి మధ్యనే పోటీ ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గత ఎన్నికల్లో మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 23,000 మంది ఓటర్లు నమోదు చేసుకోగా.. ప్రస్తుతం 30,100 మంది ఓటరు నమోదు చేసుకున్నారు.

# వివేకా హత్య ఆస్తుల కోసమే

**హైదరాబాద్, మార్చి 10. ప్రభాతవార్త:** ఉమ్మడి ఏపి దివంగత సిఎం వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరుడు వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో హైదరాబాద్ కేంద్రంగా సిబిఐ విచారణ మూడవసారి జరిగింది. ఈ కేసులో అనుమానితుడుగా చెబుతున్న కడప ఎంపి అవినాష్ రెడ్డి అవినాష్ రెడ్డిని ఇప్పటి వరకు రెండుసార్లు విచారించిన హైదరాబాద్ సిబిఐ అధికారులు తాజాగా శుక్రవారం నాడు నాలుగున్నర గంటల పాటు విచారించి భిన్న అంశాలపై ప్రశ్నించారు. కాగా విచారణ అనంతరం బయట మీడియాతో మాట్లాడిన అవినాష్ రెడ్డి వివేకా హ త్య కేసుకు సంబంధించి సంచలన వ్యాఖ్యలు చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేవలం ఆస్తు కోసమే జరిగిందని ఆయన తెలిపారు. అయితే ఇందులో తనను ఇరికించేందుకు కుట్ర జ రుగుతోందని ఆయన ఆరోపించారు.

వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో హైదరాబాద్ కేంద్రంగా సిబిఐ విచారణ ఊపందుకుంది. ఇప్పటి వరకు ఏపి కేంద్రంగా సాగిన ఈ కేసు విచారణ సుప్రీం కోర్టు ఆదేశాలతో హై దరాబాద్ సిబిఐకి మారడం తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా ఈ ఏడాది జనవరి నెల 28వ తేదీన మొదటి సారి, ఫిబ్రవరి నెల 24వ తేదీన రెండసారి అవినాష్‌ను విచారించిన సిబిఐ తాజాగా మరోసారి విచారణ చేయడం సంచలనం రేపింది. కోఠిలోని సిబిఐ కార్యాలయానికి శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో వచ్చిన అవినాష్ రెడ్డిని మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు సిబిఐ అధికారులు విచారించారు. అవినాష్ రెడ్డిని సిబిఐ ఎస్‌పి రాంసింగ్ నేతృత్వంలోని బృందం విచారించింది. ఈ విచారణలో వివేకానంద రెడ్డి హత్యకు సంబంధించి అనేక ప్రశ్నలను సిబిఐ బృందం అవినాష్ రెడ్డిని సంధించింది. సిబిఐ అధికారుల విచారణలో వివేకా హత్యలో అప్పట్లో వెలుగు చూసిన వివరాల ఆధారంగా అవినాష్ రెడ్డి ని ప్రశ్నలు సంధించారని సమాచారం. ముఖ్యంగా హత్య సమయంలో జరిగిన కొన్ని ఘటనలపై ఆయనను

### సిబిఐ విచారణ సవ్యంగా సాగడం లేదు: ఎంపి అవినాశ్‌రెడ్డి
### నాలుగున్నర గంటలపాటు ప్రశ్నించిన అధికారులు

పలుమార్లు ప్రశ్నించారని తెలిసింది. కాగా అవినాష్ రెడ్డి విచారణ తరువాత బయటకు వచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ అధికారులు తనకు 160 సిఆర్‌పిసి నోటీసు ఇవ్వడంతో విచారణకు వచ్చానని, ఈ క్రమంలో అధికారులు అనేక అంశాలపై ప్రశ్నించారని, ఇందులో అన్ని అంశాలపై సమాధానాలు చెప్పానని తెలిపారు. వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణ పారదర్శకంగా జరగడం లేదని, వాస్తవాల ఆధారంగా కాకుండా వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని సాగుతున్నట్లుగా వుందని ఆయన తెలిపారు. ఈ కేసులో తనను లక్ష్యంగా చేసుకుని సిబిఐ అధికారులు విచారణ చేస్తు న్నట్లుగా వుందని ఆయన తెలిపారు. ఇందులో పెద్ద కుట్ర వున్నట్లు తనకు అనిపిస్తోందని ఆయన వెల్లడించారు, వివేకా హత్య ముమ్మాటికీ ఆస్తుల కోసమే జరిగిందని తాను మరోసారి స్పష్టం చేస్తున్నానని, ఇందులో ఏమాత్రం అనుమానం లేదని ఆయన తెలిపారు. వివేకా హత్య జరిగిన రోజున మార్చూరీ వద్ద తాను మీడియాతో మాట్లాడానని, ఆ తరువాత రెండు రోజులకు మళ్లీ మాట్లాడానని, అప్పుడు ఏం మాట్లాడానో ఇప్పుడు అదే మాట్లాడుతున్నానని, ఎలాంటి కొత్త విషయాలు, మార్పులు, చేర్పులు లేవని ఆయన వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మీడియాలో వస్తున్న వార్తల వల్ల విచారణ పక్కదారి పడుతోందని ఆయన తెలిపారు. వివేకా హత్య తరువాత తనకు ఫోన్ వస్తే తాను బాధ్యత కలిగిన ఎంపిగా వెంటనే ఘటనా స్థలికి వెళ్లానని, ఇందులో తనకు ఎలాంటి దురుద్దేశం లేదని, అయితే తనపై కొన్ని మీడియా సంస్థలు కావాలనే ఈ విషయంలో దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన అన్నారు. ఈ కేసు విచారణకు భయపడి తాను ఎక్కడికి వెళ్లనని, ఇక్కడే వుంటానని ఆయన తెలిపారు. సిబిఐ విచారణ సందర్భంగా న్యాయవాదుల సమక్షంలో ఆడియో, వీడియోల తో రికార్డింగ్ చేయాలని తాను కోరగా అందుకు అధికారులు అంగీకరించలేదని అవినాష్ రెడ్డి చెప్పారు. తనను మరోసారి విచారణకు రావాల్సి వుంటుందని సిబిఐ అధికారులు కోరారని ఆయన తెలిపారు. సిబిఐ అధికారుల అన్ని ప్రశ్నలకు తాను సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను తాను నివృత్తి చేశానని ఆయన తెలిపారు. వివేకాంద రెడ్డి హత్య కేసును కొందరు కావాలనే త ప్పుదోవ పట్టిస్తున్నారని, వాస్తవాలను వక్రీకరిస్తున్నారని అవినాష్ రెడ్డి తెలిపారు. తెలుగుదేశం నాయకులు గూగుల్ టేక వుట్ అని అంటున్నారని, ఇందులో ఏముందనేది కాలమే చెబు తుందని, గూగుల్ టేకవుటా...? టిడిపి టేకవుటా...? అనేది చూడాల్సి వుందని ఆయన అన్నారు. 2019 మార్చి నెలలో జరిగిన వివేకానంద రెడ్డి హత్య అప్పట్లో సంచలనం రేపింది. మొదట ఈ కేసును ఏపి పోలీసులు విచారించగా ఆ తరువాత సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సిబిఐ చేబట్టింది.

ఈ కేసులో అవినాష్ రెడ్డిపై ఆరోపణలు వచ్చినా ఆయనను విచారణకు పిలువలేదు. ఈ విచారణ హైదరాబాద్ సిబిఐకి బదిలీ అయిన తరువాత నెలన్నర వ్యవధిలో మూడుసార్లు ఆయన్ను విచారించారు. మరోవైపు అవినాష్ రెడ్డి విచారణ సందర్భంగా వైకాపా కా ర్యకర్తలు సిబిఐ కార్యాలయానికి రావడంతో అక్కడ్డ ఎలాంటి ఉద్రిక్తలు తలెత్తకుండా వుండేందుకు పోలీసులను మొహరించారు. స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగలను కూడా మొహరించారు. విచారణ తరువాత అవినాష్ రెడ్డి వెళ్లిపోగా ఆయనతో పాటు కార్యకర్తలు తరలివెళ్లారు.

### ప్రభుత్వరంగ సంస్థల (భద్రత) పరిరక్షణతోపాటు

## అత్యవసర సేవలు అందిస్తున్న సిఐఎస్‌ఎఫ్ బలగాలు



### 53 యేళ్లలో విస్తరించిన సిఐఎస్‌ఎఫ్ బలగాలు,సేవలు
### 12న సిఐఎస్‌ఎఫ్ 54వ రేసింగ్ డే.. పేరెడ్ కార్యక్రమం
### హకీంపేట్ సిఐఎస్‌ఎఫ్(నిసా)కు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాక

**శామీర్‌పేట,(మేడ్చల్ జిల్లా ప్రతినిధి) మార్చి 10, ప్రభాతవార్త:** సిఐఎస్‌ఎఫ్ (నిసా) బలగాలు ప్రభుత్వ రంగ సంస్థల (భద్రత) పరిరక్షణతో పాటు అత్యవసర సేవలు అందించటంలోనూ ముందుంటుంది. దేశంలో సిఐఎస్‌ఎఫ్ గడిచిన 53ఏళ్లలో బలగాల పెంపుతో పాటు అత్యవసర సేవలు కూడ పెరిగినట్లు తెలిపారు. సిఐఎస్‌ఎఫ్ ఫైర్ సేవలు (అగ్నిమాపకదళం ద్వారా) కూడ ఆస్తులను కాపాడటానికి సేవలు అందించటం జరుగుతుందన్నారు. ఈ నెల 12వ తేదీన సిఐఎస్‌ఎఫ్ 54 రేసింగ్ డేను పురస్కరించుకుని హకీంపేట్‌కు సిఐఎస్‌ఎఫ్‌కు ఆదివారం ఉదయం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విచ్చేస్తున్నారు. దీనికి సంబంధించి భద్రతాబలగాలు సంబంధిత అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ..శుక్రవారం ఈ సందర్భంగ మేడ్చల్ జిల్లా హకీంపేట్‌లోని సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్‌ఎఫ్),నేషనల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ అకాడమీ (నిసా)లో విలేకరుల సమావేశంను ఏర్పాటు చేశారు. సిఐఎస్‌ఎఫ్ ఎడిజి (నార్త్) పియూష్ ఆనంద్, ఎడిజి (సౌత్) జగదీశ్‌సింగ్, ఎడిజి (ఎపిఎస్) జ్ఞానేందర్‌సింగ్, నిసా డైరక్టర్ కె.సునీల్ ఇమ్మాన్యుల్‌లు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ దేశంలోనే సిఐఎస్‌ఎఫ్ 1969సంవత్సరంలో కేవలం మూడు వేల మందితో ఏర్పాటు జరిగిందన్నారు. గడిచిన 53ఏళ్లలో సిఐఎస్‌ఎఫ్ బలగాలు సుమారు 1,70,000మందితో ప్రస్తుతం కొనసాగుతుందన్నారు. సిఐఎస్‌ఎఫ్ సుమారు 354సంస్థలకు భద్రత కల్పిస్తుందన్నారు. 66ఎయిర్‌పోర్ట్సు,సీపోర్ట్సు, న్యూక్లియర్ స్పేస్ సంస్థలు, ఢిల్లీ మెట్రో, స్టీల్ అండ్ పవర్ ప్లాంట్స్, పలు వాటికి సిఐఎస్‌ఎఫ్ బలగాలు భద్రత ఉంటున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగ స్పెషల్ సెక్యూరిటీ గ్రూపు (ఎస్‌ఎస్‌జి) ఆఫ్ సిఐఎస్‌ఎఫ్ 147కేటగిరిలుగ రక్షణ కల్పిస్తుందన్నారు. అదే విధంగ ఫైర్ సర్వీస్ సేవలు కూడ 111 యూనిట్స్ ద్వారా సిఐఎస్‌ఎఫ్ విశేష కృషి చేస్తుందన్నారు. 2022-2023లో 4కొత్త యూనిట్స్, ఫైర్ వింగ్స్ ఏర్పాటు జరిగి సిఐఎస్‌ఎఫ్ సేవలు అందించబోతుం దన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు మెట్రో ఢిల్లీలో, అదే విధంగ రామ జన్మ భూమి దేవాలయంకు సెక్యూరిటీ సిఐఎస్‌ఎఫ్ విధులు నిర్వహించటం జరుగుతుందన్నారు. అగ్నిమాపకదళం అధికారులకు, సిబ్బంది మెరుగైన శిక్షణ ఇచ్చి 111యూనిట్స్ ద్వారా ఆస్తులను కాపాడటంతో పాటు కోట్ల రూపాయల విలువలను వస్తువులను కాపాడుతున్నట్లు ఆదా చేస్తుందన్నారు. సిఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాల ఫైర్ స్టేషన్లతో సమన్వయం తోనూ పనిచేస్తుందన్నారు. 5 ఏళ్లలో ఫైర్ వింగ్ ద్వారా 16,074 ఫైర్ కాల్స్‌స్వీకరించి సంఘటన స్థలంకు వెళ్లి సుమారు 1392.53 కోట్ల రూపాయల విలువ చేసే ఆస్థులను కాపాడటం జరిగిందన్నారు. ఎయిర్‌పోర్టులలో కూడ పలువురిపై కేసులు చేసి రికవరీ కూడ చేయటం జరిగిందన్నారు. అయితే 1969లో సిఐఎస్‌ఎఫ్ ఏర్పాటు జరిగింది. అయితే హైదరాబాద్‌లోని శివరాంపల్లిలో 1971లో కాలేజ్ ఏర్పడింది. ఆ తరువాత ఫైనల్‌లో 1987సంవత్సరంలో సిఐఎస్‌ఎఫ్ శిక్షణా కాలేజీని నగర శివారులోని హకీంపేట్ కు మార్పు చేసి అప్‌గ్రేడ్ చేసి నేషనల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ అకాడమీని (సిఐఎస్‌ఎఫ్) ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలువురు సిఐఎస్‌ఎఫ్ ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌లో హెచ్3ఎన్2 వైరస్‌తో ఇద్దరు మృతి



**న్యూఢిల్లీ, మార్చి 10:** దేశంలో వేగంగా వ్యాపిస్తున్న హెచ్3ఎన్2 వైరస్‌కు సంబంధించి హర్యానా, కర్ణాటకలో ఒక్కొక్కరు చొప్పున మరణించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కర్ణాటకలో చోటు చేసు కున్న మరణాన్ని అధికా రులు ధ్రువీకరించారు. హాసన్ జిల్లాకు చెందిన 82యేళ్ల హీరే గౌడ హెచ్3ఎన్2 వైరస్ కారణంగా మార్చి 1న మృతి చెందినట్లు ఆ జిల్లా ఆరోగ్య అధికారి పిటిఐకి వెల్లడించారు. బాధితుడు ఫిబ్రవరి 24న ఆసుపత్రిలో చేరగా, మార్చి 1న మరణించినట్లు తెలిపారు. మృతుడు హీరే గౌడకు బిపి, షుగర్ కూడా ఉన్నట్లు ఆరోగ్య అధికారి తెలిపారు. కాగా హరియాణాలో ఇన్‌ఫ్లుయెంజా మరణాన్ని మాత్రం ఇంకా ధ్రువీకరించలేదు. ఈ వైరస్ కారణంగా ఇన్ ఫ్లూయెంజా బారినపడ్డ వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఈ వ్యాధి బాధితులు 90 మందికిపైగా ఉన్నారని అధికార వర్గాల సమాచారం. అదేవిధంగా ఎనిమిది మంది హెచ్1ఎన్1 వైరస్ బారినపడ్డారని వెల్లడించాయి. ఫ్లూ బాధితుల సంఖ్య ఇటీవల పెరుగుతోందని, అందులో చాలా వరకు హాంకాంగ్ ఫ్లూగా పిలిచే హెచ్3ఎన్2 బాధితులేనని వైద్యులు తెలిపారు. ఈ కొత్త వైరస్ సోకిన వాళ్లలో జ్వరం, వణుకు, దగ్గు, శ్వాస ఆడకపోవడం, శ్వాస తీసుకునేటప్పుడు శబ్దాలు రావడం తదితర లక్షణాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వీటికి అదనంగా వాంతి వచ్చినట్లు అనిపించడం, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు, డయేరియా తదితర లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. మిగతా అనారోగ్యాల బారినపడ్డ వారిలోనూ ఈ లక్షణాలు కనిపించవచ్చని, అయితే వారం పైగా ఈ లక్షణాలు ఉంటే అనుమానించాల్సిందేనని చెప్పారు. నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## తీవ్ర ఉత్కంఠ!

>> జారీ చేసింది. వీరిని శనివారం నుంచి వారం రోజుల పాటు వరుసగా విచారించనున్నారని తెలిసింది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో తెలంగాణ బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏ కవిత శనివారం నాడు ఢిల్లీలో ఈడీ విచారణకు హాజరుకానున్న నేపథ్యంలో శుక్రవారం కొన్ని అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇందులో మొదటిది ఈ కేసులో ఈడీ ఇటీవలే అరెస్టు చేసిన అరుణ్ రామచంద్ర పిళ్లై ఆకస్మికంగా ప్లేట్ ఫిరాయించాడు. ఈ కేసులో తాను కవితకు బినామి అనీ, ఆమె ప్రతినిధిగా తాను దక్షిణాది గ్రూప్‌లో హాజరయ్యేవాడినని ఇడికి పిళ్లై వాంగ్మూలం ఇవ్వడం తెలిసిందే. కవిత తరపున తాను లిక్కర్ స్కాంలో అన్నీ లావాదేవీలు నిర్వహించేవాడినని అతను చెప్పడం విదితమే. ఇదే సమయంలో మరిన్ని విషయాలను పిళ్లై ఇడికి చెప్పగా ఇవే వివరాలను ఇడి అధికారులు కోర్టుకు నివేదించారు. పిళ్లై ప్రస్తుతం ఇడి కస్టడీలో వుండగా వున్నట్లుండి అతను శుక్రవారం నాడు ఢిల్లీలోని సిబిఐ ప్రత్యేక కోర్టులో ఒక పిటిషన్ దా ఖలు చేశాడు. ఇడికి తాను ఇచ్చిన వాంగ్మూలం అనేకరకాల ఒత్తిడికి లోనై ఇచ్చినట్లు అతను తెలిపాడు. ఇందులో వాస్తవాలు లేవని ఊహాగానాలు, అవాస్తవాలు వున్నా యని అతను తన పిటిషన్‌లో తెలిపాడు. కాగా పిళ్లై దాఖలు చేసిన పిటిషన్‌పై సిబిఐ ప్రత్యేక కోర్టు ఇంకా స్పందించలేదు. దీనిపై శనివారం నాడు సిబిఐ ప్రత్యేక కోర్టు స్పందించే వీలుంది. పిళ్లై పిటిషన్‌పై సిబిఐ ప్రత్యేక కోర్టు ఎలా స్పందిస్తుందనేది చూడాల్సి వుంది. ఇదే సమయంలో కవిత శనివారం ఉదయం పది గంటల సమయ ంలో ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి లిక్కర్ స్కాంలో విచారణకు హాజరుకానున్నారు. పిళ్లై ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కవితను ఈడీ అధికారులు విచారించనునా న్నరు. మొదట కవితను ఒంటరిగా విచారించి ఆ తరువాత పిళ్లైను ఎదురుగా కూర్చోబెట్టి ఇద్దరికి ఒకేసారిగా విచారించే వీలుంది. ఆ తరువాత ఇద్దరిని విడివిడిగా విచా రించే వీలుంది. ఈ విచారణ సాయంత్రం పొద్దుపోయే వరకు సాగే వీలుందని తెలుస్తోంది. అయితే తాను ఇచ్చిన వాంగ్మూలం ఒత్తిడికి లోనై ఇచ్చినట్లుగా పిళ్లై సిబిఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్ వేయడం, దీనిపై శనివారం నాడు కోర్టులో విచారణ జరగనుండడంతో కవిత విచారణ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవేళ పిళ్లై పిటిషన్‌ను సిబిఐ ప్రత్యేక కోర్టు పరిగణలోకి తీసుకుని, కవిత విచారణకు ఏమైనా బ్రేక్ వేసే అవకాశాలున్నాయనే వార్తలు కూడా వస్తున్నాయి. అయితే ఒకవేళ పిళ్లై పి టిషన్‌ను సిబిఐ ప్రత్యేక కోర్టు పరిగణలోకి తీసుకున్నా ఇదే కేసులో సిసోడియా రిమాండు రిపోర్టు ఆధారంగా ఆ మెను విచారించేందుకు ఈడీ సిద్ధమవుతుందని కూడా సమాచారం. మరోవైపు శనివారం నాడు కవితను ఈడీ విచారించనున్న నేపథ్యంలో ఈడీ అధికారులు లిక్కర్ స్కాంలో మరో ఏడుగురికి నోటీసులు ఇచ్చారు. వీరిని శనివారం నుంచి వారం రోజుల పాటు విచారించనున్నారని తెలిసింది.

**ఢిల్లీలో భారీ భద్రత**

ఇదిలావుండగా బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కవితను ఈడీ అధికారులు విచారించనున్న నేపథ్యంలో ఢిల్లీలోని ఇడి కార్యాలయంతో పాటు రౌస్ అవెన్యూ కోర్టు, సిబిఐ కా ర్యాలయం వద్ద భారీగా బందోబస్తు చేబట్టారు.

## నైజీరియాలో బస్సును ఢీకొన్న రైలు

### ఆరుగురి మృతి, పలువురికి గాయాలు

**అబుజ, మార్చి 10:** నైజీరియాలోని లాగోస్‌లో ఓ రైలు, ప్రయాణీకుల బస్సును ఢీకొనడంతో ఆరుగురు చనిపోగా, పలువురు గాయపడ్డారు. లాగోస్‌లోని ఇకేజా ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. బస్సులో ఉన్న వారంతా ప్రభుత్వ ఉద్యోగులని ఆ దేశ జాతీయ ఎమర్జెన్సీ విభాగం పేర్కొంది.



ఈ ప్రమాదం నుంచి 84మందిని కాపాడి, సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపింది. బాధితులంతా బస్సులోని వారేనని, రైలులోని ప్రయాణీకులెవరూ ఈ ప్రమాదంలో గాయపడలేదని పేర్కొంది. బస్సు డ్రైవర్ ట్రాఫిక్ సిగ్నల్ పాటించనందునే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. నైజీరియాలో ట్రాఫిక్ నిబంధనల అమలు సరీగ్గా లేనందున రైళ్లు..ట్రక్కులను ఢీకొంటున్న ఘటనలు జరుగుతు న్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

